క్లుప్తంగా

ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన కల్పించండి

డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలపై ప్రయాణీకులకు అవగాహన కల్పించాలని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం డిపో ఆవరణలో సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి వచ్చిన పార్శిల్స్‌ను డోర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. తెనాలిపరిసర ప్రాంత ప్రజలందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ

అర్జీల దాఖలుకు 30వ తేదీ తుదిగడువు

తెనాలి: డివిజను పరిధిలో హేతుబద్ధీకరణ ద్వారా నూతనంగా ఏర్పడిన, వివిధ రకాల కారణాలతో ఖాళీఅయిన చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ (ఆర్‌సీ నెం .1134/2024-ఈ, తేదీః 20.12.204) జారీ చేసినట్టు తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సదరు డీలర్ల ఎంపిక రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపరచిన నిబంధనలకు లోబడి తమ అర్జీలను సబ్‌కలెక్టర్ కార్యాలయం, తెనాలికి నేరుగా లేదా రిజిస్టరు పోస్టుద్వారా గాని ఈనెల 30వ తేదీ సాయంత్రం అయిదు గంటల్లోగా అందజేయాలని సూచించారు. అర్జీ నమూనా కావాల్సినవారు సంబంధిత తహసీల్దారు కార్యాలయం , లేదా తమ కార్యాలయాన్ని పనివేళల్లో పొందవచ్చని వివరించారు.


అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి



తెనాలిఅర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొలవరపు దేవానంద్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమిత్ షా ఒక పాలకుడుగా కాకుండా మత ప్రచారకుడిగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమానించే రీతిలో ఆయన వ్యాఖ్యలున్నాయని, వాటిని వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుద్దపల్లి కనకరాజు, గోరికపూడి బాలరాజు, బి.సుకుమార్, కిన్నెర నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



తెనాలిరూరల్: బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెంది మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన కొలకలూరు ఫ్లై ఓవర్ వద్ద గురువారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖాజీపేటకు చెందిన వెలివెల మహేష్ (23) గుంటూరులో సూపర్‌మార్కెట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి తన స్నేహితుడు వరుణ్‌నాగ్‌తో కలసి తెనాలి వచ్చి, తిరుగు ప్రయాణంలో కొలకలూరు ఫ్లై ఓవర్ వంతెన వద్ద వీరి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వరుణ్‌నాగ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రతీర రక్షణ, భద్రతకు 'మిషన్-974'

- మానవ రక్షణ అధ్యయన సంస్థ రూపకల్పన
- సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కన్నెగంటి



తెనాలి: నేటి కాలంలో అందుబాటులోకి వచ్చిన కృత్రిమ మేధ, బ్లాక్ షైన్, ఐఓటీ, 5జీ సాంకేతిక పరిజ్ఞానాలతో దేశంలోని తీరప్రాంతాలకు, నౌకాశ్రయాలకు మెరుగైన రక్షణ, భద్రతకు వీలుంటుందని హైదరాబాద్‌లోని మానవ రక్షణ అధ్యయన సంస్థ (బీహెచ్ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కన్నెగంటి అన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమం, పర్యాటకరంగ అభివృద్ధి, సముద్రతీర పారిశుధ్యంతో పాటు అక్రమ రవాణాను అరికట్టం సాధ్యపడుతుందని చెప్పారు. ఇందు కోసం తమ సంస్థ తరఫున 'మిషన్-7,516' ప్రాజెక్టును రూపకల్పన చేసినట్టు శుక్రవారం స్వస్థలమైన తెనాలిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో తాను జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ వద్ద పని చేసిన అనుభవంతో దేశ అంతర్గత భద్రత, సముద్రజలాల రక్షణను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రాజెక్టును రూపొందంచినట్టు చెప్పారు. దేశంలో 7,516 కిలోమీటర్ల తీరప్రాంతం ఉందన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో సముద్ర జలాలు, తీరప్రాంతం రక్షణ, భద్రత కీలకమైన అంశాలుగా గుర్తుచేశారు. తొలుత ఆంధ్రప్రదేశ్‌లోని 974 కిమీ తీర రక్షణ, భద్రత, అభివృద్ధి కోసం తన మిషన్ పని చేస్తుందన్నారు. టెక్నాలజీ అనుసంధానం , సముద్రజలాల్లో కళ్లు, చెవులు వంటి రెండు కోట్ల గంగపుత్రులును భాగస్వామ్యం చేయటం ప్రధాన అంశాలుగా కృషిచేస్తానని తెలిపారు. తమ సంస్థకు అనుసంధానమైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సలహాలు, సూచనలతో, నౌకాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్, కస్టమ్స్, షిప్పింగ్ కంపెనీలు, టెక్నాలజీ కంపెనీల అధినేతలు, సముద్ర భద్రతపై పనిచేస్తున్న విద్యాసంస్థలు, అందరినీ సమన్వయరచి, ముందుగా 'మిషన్-974' కు ప్రయత్నిస్తానని చెప్పారు.

నెల్లూరులో ఆడిషన్లకు మా-ఏపీకి సంబంధం లేదు

- రాష్ట్రంలో గుర్తింపు పొందిన యూనియన్ ఒక్కటే
- మా-ఏపీ వ్యవస్థాపకుడు/ సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: నెల్లూరులో జరగనున్న సినిమా ఆడిషన్లకు మా-ఏపీకి ఎలాంటి సంబంధం లేదనీ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన మూవీ ఆర్టిస్టు అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ) తమది మాత్రమేనని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా స్పష్టంచేశారు. ఇక్కడి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరులో మా-ఏపీ పేరుతో ఆడిషన్లు నిర్వహిస్తున్నట్టు, ఎంపికైన వారికి మా-ఏపీలో సభ్యత్వం కల్పించి, సినిమా ప్రాజెక్టులకు వారి పేర్లు సిఫార్సు చేస్తామంటూ కొన్ని పత్రికా ప్రకటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. వాస్తవానికి మా-ఏపీకి ఆడిషన్లకు ఎలాంటి సంబంధం లేదనీ, తమ యూనియన్ అలాంటి బాధ్యతలు పెట్టుకోదని చెప్పారు. ఎవరైనా మోసపోతే తమ బాధ్యత లేదన్నారు. తమ యూనియన్‌ను 2018 ఫిబ్రవరి 14న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మికశాఖ రిజిస్ట్రేషన్ నెంబరు 'హెచ్-196'తో ఆమోదించినట్టు గుర్తు చేశారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికే మా-ఏపీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతికనిపుణులకు ఇండ్ల స్థలాల కోసం కృషిని కొనసాగిస్తున్నట్టు చెబుతూ సంబంధిత ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు అందజేసినట్టు దిలీప్‌రాజా వివరించారు. మా-ఏపీ పేరుతో కాకుండా వేరే యూనియన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు చేసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. వీరితో సహాయ దర్శకులు నరేష్ దోనే, మణి ఉన్నారు.

అర్బన్ మార్కెట్లను ప్రోత్సహించేందుకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. పురుషులతో సమానంగా వారు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు.

కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ అర్బన్ మార్కెట్‌లో వివిధ రకాల ఉత్పత్తులను విక్రయాలకు ఉంచడం జరిగిందన్నారు. నెలలో రెండు రోజులు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ వీటిని సందర్శించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. శనివారం కూడా అర్బన్ మార్కెట్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ దేవసేన, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మెప్మా, టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2025 క్యాలెండర్‌ను అధ్యక్షులు సి.హెచ్.సూర్యవెంకటేష్ శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కొడాలి సుబ్రమణ్యం, గడ్డికోట రాజేష్ రమేష్, కొండ, దమోదరరావు, కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు అన్నమాచార్య కీర్తనల గీతాంజలి

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ సంకీర్తన వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22న 'శ్రీతాళ్లపాక అన్నమాచార్య కీర్తనల గీతాంజలి' నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందిన గాయనీగాయకులు అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తారని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పురుషోత్తమరావు తెలియజేశారు. మృదంగం, తబలా, కీబోర్డు, వయొలిన్, మోర్సింగ్, ఘటం, వేణువుపై ప్రముఖ విద్యాంసులు సహకారం అందిస్తారని తెలిపారు. సరిగ్గా ఆరుగంటలకు ఆరంభమై 8.30 గంటల వరకు అన్నమాచార్య కీర్తనల ఆలాపన ఉంటుందని వివరించారు. సంగీతాభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ రమేష్‌కు సత్కారం



డాక్టర్ రమేష్ కన్నెగంటిని సత్కరిస్తున్న అభిమానులు

తెనాలి: హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న 'మానవ రక్షణ అధ్యయన సంస్థ' (బీహెచ్ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కన్నెగంటిని శుక్రవారం స్వస్థలమైన తెనాలిలో సత్కరించారు. కృత్రిమ మేధపై అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు హాజరై వచ్చిన సందర్భంగా ఈ అభినందన సభను ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశానికి న్యాయవాది దంతాల కిరణ్ అధ్యక్షత వహించారు. తీరప్రాతం రక్షణ, నౌకాశ్రయాల భద్రతపై నూతన ప్రాజెక్టు రూపకల్పన చేయటం అభినందనీయమన్నారు. పుల్లరి ఉద్యమ యోధుడు కన్నెగంటి హనుమంతు మునిమనుడుగా దేశభక్తితో దేశరక్షణ అంశాల్లో వివిధ యూనివర్సిటీలు, ప్రభుత్వాలతో కలసి పనిచేస్తుండటంపై వక్తలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వీరితోపాటు సంస్థ డైరెక్టర్ (ఔట్‌రీచ్) బొజ్జా రవిని కూడా సన్మానించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, బొల్లిముంత కృష్ణ, కన్నెగంటి గోపీచంద్, కన్నెగంటి మణికుమార్, డి.జాన్, విద్యుత్ కార్మిక నేత గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



ఏఈ సూర్యబాబుకు సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో రోడ్ల వెంట ఉన్న అక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ మార్కెట్ వద్ద ఉన్న రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో దానిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే శివాజీచౌక్‌లో జరిగిన రోడ్డు విస్తరణ ప్రాంతంలో ఎటువంటి తోపుడు బండ్లను అనుమతించవద్దని సూచించారు. ప్రజల సౌకర్యార్థం వీటిని విస్తరించినట్లు చెప్పారు. చిరు వ్యాపారులు తమ కేటాయించిన ప్రాంతంలోనే విక్రయాలు జరుపుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ సూరిబాబు, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అబాకస్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: యుసీఎంఎఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన అబాకస్ పోటీల్లో సుల్తానాబాద్‌లోని భాష్యం స్కూల్ విద్యార్థులు షేక్ షబీరా బేగం , షేక్ షీరాజ్ ఆలీలు రన్నరప్‌లుగా నిలిచారని ప్రిన్సిపల్ మణికాంత్ తెలిపారు. వీటిని న్యూఢిల్లీలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో మెమొంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జడ్ఈవో హృదయరాజు, హెచ్ఎం నాజీనీన్ జిగర్, రాము, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మార్గదర్శకం



పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఆలపాటి, హెనీక్రిస్టినా



కేక్ కట్ చేస్తున్న ఫాదర్ ఆంథోని విన్సెంట్, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ



క్యాడిల్ సర్వీసులో పాల్గొన్న జాన్‌బాబు, రాణి

తెనాలిరూరల్: నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమన్న ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కళ్యాణ మండపంలో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో పాస్టర్స్ గ్రాండ్ క్రిస్మస్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిపాస్టర్ మల్లవరపు విజయ్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో 300 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పంచారు. బ్రదర్ సాల్మన్ , టీడీపీ క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కారుమూరి జక్రయ్యపర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబొయిన హరిప్రసాద్, ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, ఈదర పూర్ణచంద్ పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు అజ్ఞలు పాటిద్దాం

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు బోధించిన ఆజ్ఞలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఫాదర్ ఆంథోని విన్సెంట్ పేర్కొన్నారు. సెమిక్రిస్మస్ వేడుకలను జెఎంజె కళాశాలలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహం నింపుతుందని చెప్పారు. ప్రపంచంలోని ఎక్కువ మంది ప్రజలు ఆనందంగా పండుగను జరుపుకుంటారని చెప్పారు. ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్ అని చెప్పారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. అలాగే కేక్‌ను కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులు క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్

తెనాలిఅర్బన్: ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగల్లో అతిముఖ్యమైనది క్రిస్మస్ అని ఎల్ఎఎఫ్ సంస్థ వ్యవస్థాపకులు బ్రదర్ ండి ఐజక్ పేర్కొన్నారు. ది లవ్ ఇన్ యాక్షన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఇందిరా నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద గురువారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను ఆచరించడం నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. అందరూ ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే క్యాండిల్ లైట్ సర్వీస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్‌బాబు, రాణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస వ్రత దీక్షా మహోత్సవాలు



తిరుప్పావై ప్రవచనం చేస్తున్న దాసస్వామి



హాజరైన భక్తులు

తెనాలి: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీశరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు తెనాలిలో వైభవంగా జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్-వీఎస్సార్ కాలేజీ రోడ్డులోని ప్రత్యేక వేదికపై నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే పూజలు ఆరంభించారు. ఉదయం 5.30కు తిరుమంజనం అనంతరం 8 గంటలకు అష్టోత్తర శతనామార్చన, తిరుప్పావై సేవాకాలం, గోపూజ, శ్రీలక్ష్మీనారాయణ కుంకుమపూజ చేశారు. తదుపరి తీర్థగోష్ఠితో కార్యక్రమాలు పూర్తయ్యాయి. సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం అనంతరం తిరుప్పావై ప్రవచనం చేశారు. ప్రతిరోజూ ఇదే తరహాల్లో కార్యక్రమాలు ఉంటాయని, శుక్రవారం కుంకుమపూజ అదనమని తెలియజేశారు. భక్తులు పాల్గొనాలని సూచించారు.

తహసీల్దార్ శిక్షణలో ట్రైనీ ఐఏఎస్ అధికారి



రైతులతో మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్

తెనాలిరూరల్: 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెనాలిలో తహసీల్దార్ శిక్షణకు వచ్చారు. నెల రోజుల పాటు ఇక్కడ ఉండి తహసీల్దార్ విధులు, పరిధి, బాధ్యతల గురించి అధ్యయనం చేస్తారు. శిక్షణలో భాగంగా తొలిరోజు స్థానిక తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో కలసి మండలంలోని ఖాజీపేట, కొలకలూరు, బుర్రిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఖాజీపేటలో శ్మశానవాటిక స్థల వివాదం, కొలకలూరులో రెండు సామాజిక వర్గాల మధ్య డొంక రోడ్డు వివాదం, బుర్రిపాలెంలో మ్యుటేషన్ కోసం ఇటీవల గ్రీవెన్స్‌లో పిటీషన్‌లు వచ్చాయి. వాటి పరిష్కారం కోసం తహసీల్దార్ గోపాలకృష్ణతో కలసి ఐఏఎస్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మూడు గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. సమస్య తీవ్రత, వాటి పరిష్కారం గురించి చర్చించారు. అలాగే రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు.